క్లుప్తంగా

వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన మునిసిపల్ కమిషనర్



పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక రాజీవ్‌నగర్‌లోని వృద్ధుల ఆశ్రమాన్ని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ ఆశ్రమంలో 17 మంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారు. వారికి అందుతున్న సదుపాయాలు, సేవలపై కేర్‌టేకర్ కోమలి మణిమ్మను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లను పరిశీలించి, ఆశ్రమాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఆశ్రమంలో ట్యాప్ వేయాలని వృద్ధులు కోరడంతో వెంటనే కుళాయి కనెక్షన్ ఇవ్వాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

మట్టి దిబ్బల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. భానునగర్ బీఆర్‌టీఎస్ రోడ్డు మలుపులోని మట్టి దిబ్బలను మంగళవారం జేసీబీతో తొలగించారు. ఇటీవల భానునగర్‌లో రోడ్డును తవ్వి వాటర్‌పైపులైన్ పనులు ప్రారంభించారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పైపులైను కోసం నేలను తవ్వగా వచ్చిన మట్టిని రోడ్డు మలుపులో గుట్టలుగా పోసి వదిలేశారు. ఈ మట్టి దిబ్బలతో స్థానికులు ఎదుర్కొంటున్న అవస్థలను వివరిస్తూ 'సాక్షి'లో మంగళవారం 'నత్తనడకన పైపులైన్ పనులు!' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించి రోడ్డు పక్కన మట్టి దిబ్బలను తొలగించారు. పైపులైన్ ఏర్పాటు పనులను వేగవంతం చేశారు.

బీబీఏ ఉపాధ్యక్షుడిగా పిళ్లా శ్రీనివాసరావు



విజయవాడలీగల్: బీబీఏ ఉపాధ్యక్షుడిగా పిళ్లా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2025-2026 సంవత్సరానికి జరుగుతున్న బీబీఏ ఎన్నికల్లో నామినేషన్లు పరిశీలన అనంతరం ఉపాధ్యక్ష పదవికి పిళ్లా శ్రీనివాసరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి డి.పి. రామకృష్ణ ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ల జాబితాలో 30 ఏళ్ల పైబడిన సీనియారిటీ విభాగంలో పి.వి.ఏడుకొండలు, రెండేళ్ల పైబడిన విభాగంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా 14 మందికి అవకాశం ఉండగా 14 మంది మాత్రమే పోటీచేయడంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. గవర్నింగ్ బాడీ, మిగతా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు 10, 20 ఏళ్ల పైబడిన విభాగంలో యథావిధిగా ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఆకాంక్షించారు. అజిత్‌సింగ్‌నగర్ మక్కా మసీదులో మంగళవారం సాయంత్రం మసీదు పెద్ద నాగూర్ ఆధ్వర్యాన ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ముస్లింలతో కలసి ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందు స్వీకరించారు.

పోలీసుల అదుపులో వంశీ అనుచరుడు రంగా

గన్నవరం: మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరుడైన ఓలుపల్లి మోహన్‌రంగాను మంగళవారం గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండేళ్ల క్రితం గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై జరిగిన దాడి కేసులో రంగాను పోలీసులు ఏ1 నిందితుడిగా చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వంశీమోహన్‌తో పాటు ఆయన అనుచరుడు రంగాను టార్గెట్ చేశారు. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్‌కు పాల్పడ్డారంటూ పటమట పీఎస్‌లో కేసు, గన్నవరం పీఎస్‌లో నాలుగు, ఆత్కూరు, వీరవల్లి పీఎస్‌ల్లో ఒక్కొక్క కేసు చొప్పున కొత్తగా రంగాపై కేసులు నమోదయ్యాయి. అజ్ఞాతంలోకి వెళ్లిన రంగాను రాజమండ్రి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీస్ అధికారులు రంగాను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రంగాను కలిసేందుకు ఆయన కుటుంబ సభ్యులు, లాయర్లను పోలీసులు అనుమతించలేదు. పోలీసుల తీరుపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

బహిరంగ సిట్టింగ్



ఆంధ్రరత్న పార్కురోడ్డులో మందుబాబులకు అడ్డాగా పార్కింగ్ చేసిన ఆటోలు
(ఇన్‌సెట్లో) సీతన్నపేటగేటు వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు

బహిరంగ సిట్టింగులతో మందుబాబులు కిక్కెక్కుతున్నారు. రోడ్డు.. పార్కు.. ఖాళీ స్థలం.. నిలిపివున్న ఆటోలు.. ఇలా ఎక్కడైనా సరే పగలూ రాత్రి అన్న తేడాలేకుండా మందుతాగి తూలుతున్నారు. సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాల్లో బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. ముఖ్యంగా బీఆర్‌టీఎస్ రోడ్డు, గిరివీధి, ఆంధ్రరత్నపార్కు రోడ్డులో నిలిపి ఉంచిన ఆటోలు, రైల్వే కాలనీ, రైల్వే పార్కుల్లో మద్యం తాగి నానాయాగీ చేస్తున్నారు. బహిరంగంగా మద్యం తాగుతూ అటుగా రాకపోకలు సాగించే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మహిళలు, విద్యార్థినులు భయంభయంగా ఆ ప్రాంతాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రాత్రివేళ మందుబాబుల ఆగడాలు మరింత శృతిమించుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం వల్లే మందుబాబులు యథేచ్ఛగా రోడ్డుపైనే మందు తాగుతున్నారని ఆరోపిస్తున్నారు. బారుల్లో మద్యం రేట్లు అధికంగా ఉండటంతో చాలా మంది యువకులు, మందు బాబులు వైన్ షాపుల్లో మద్యంకొనుగోలు చేసి రోడ్లపైనే, దుకాణాల చాటున, నిలిపి ఉంచిన ఆటోల్లో మద్యం తాగుతున్నారు. ఖాళీ మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, ఆహార వ్యర్థాలను రోడ్లపైనే పడేసి వెళ్తున్నారు. కొందరైతే తాగేసిన మద్యం బాటిళ్లను రోడ్లపై పగలగొట్టి హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులు స్పందించి రాత్రుళ్లు నిఘా పెంచి మందుబాబుల ఆటకట్టించాలని సత్యనారాయణపురం ప్రజలు కోరుతున్నారు.

– సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):

ఆంధ్రరత్న పార్కు వద్ద ఆటోల పక్కన తాగిపడేసిన మద్యం సీసాలు





రైల్వే పార్కులో దర్శనమిస్తున్న ఖాళీ మద్యం సీసాలు

మహిళల రక్షణ కోసం సహాయ డెస్క్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళలు, పిల్లల భద్రత కోసం మహిళల సహాయ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, ఈ డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమెన్ పోలీస్ వై.సోమమ్మ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళల సహాయ డెస్క్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోమమ్మ మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలపై జరిగే అన్ని నేరాలకు సహాయ డెస్క్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు 112, 181, 1930, 1098కు కాల్ చేయటం ద్వారా తక్షణసహాయం పొందొచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ పోలీసు సేవలను గురించి తెలుసుకోవటంతో పాటు వాటిని అవసరమైన సమయంలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పి.రమేష్ బాబు, డి.యుగంధర్, కె.రమేష్ సుధాకర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మాచవరం పోలీసులు

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్)/విజయవాడ లీగల్: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జికం ఐదో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సి.రమణారెడ్డి అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్జి రమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు కనిపెట్టుకొని ఉండాలని సూచించారు. ఎవరైనా చిన్న పిల్లలపై లైంగికంగా అఘాయిత్యాలు, అకృత్యాలకు పాల్పడితే చట్టప్రకారం వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టంచేశారు. బాధితుల్లో మనోధైర్యం నింపడానికి, సమాజంలో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వపరంగా పరిహారం అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అజిత్‌సింగ్‌నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.రమ్యశ్రీ, మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ కంచర్ల త్రినాథ్‌కుమార్, పి.ఎల్.వి. సాల్మన్ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మేజిస్ట్రేట్ రమణారెడ్డి

కిడ్నాప్ కేసులో న్యాయవాది అరెస్టు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఒక చీటింగ్ కేసులో ముద్దాయిలకు అండగా నిలిచిన న్యాయవాది నగదు లావాదేవీల్లో నెలకొన్న వివాదాలతో వారిలో ఒకరిని కిడ్నాప్ చేసిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నానికి చెందిన పచ్చిపులుసుల స్వప్నకుసుమ ఎవియేషన్ అకాడమీ నెలకొల్పి విద్యార్థులను చేర్చుకునేందుకు విజయవాడలో సెమినార్లు నిర్వహిస్తున్నారు. కొంత మంది అకాడమీ పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నట్లు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు స్వప్నకుసుమ, ఆమె సోదరుడు రాజ్‌కుమార్, ఉద్యోగి అవినాష్‌ను ఈ నెల 24న విచారణకు పిలిచారు. న్యాయవాది షేక్ అన్వర్ వారి తరపున నిలిచాడు. మంగళవారం కూడా పోలీసులు విచారణకు పిలవడంతో స్వప్నకుసుమ తదితరులు హాజరై తిరిగి విశాఖపట్నం వెళ్లేందుకు బయులుదేరారు. అన్వర్ వారిని అడ్డుకుని తనకు రూ.3.50 లక్షలు ఇచ్చి వెళ్లాలని డిమాండ్ చేశారు. వారు నిరాకరించడంతో అవినాష్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని, వెనకాల మీరు కూడా రావాలంటూ స్వప్నకుసుమ, ఆమె సోదరుడికి చెప్పి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై స్వప్నకుసుమ పోలీసులకు ఫిర్యాదు చేసి, అన్వర్‌ను వెంబడించి వెళ్లారు. వన్‌టౌన్ పంజాసెంటర్‌లోకి కార్పొరేటర్ హర్షద్ కార్యాలయానికి అవినాష్‌ను అన్వర్ తీసుకెళ్లాడు. అక్కడ స్వప్నకుసుమ, రాజ్‌కుమార్, అవినాష్‌పై అన్వర్‌తో పాటు హర్షద్, చోటు, సైదా దాడిచేసి వారి నుంచి బలవంతంగా రూ.50 వేలు ఫోన్‌పే ద్వారా తీసుకున్నారు. ఎస్ఎన్‌పురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బాధితులను రక్షించారు. స్వప్నకుసుమ ఫిర్యాదు మేరకు న్యాయవాది అన్వర్‌ను అరెస్టు చేశారు.



రోడ్డుపై బైఠాయించిన న్యాయవాదులు

న్యాయవాదుల ఆందోళన

న్యాయవాది అన్వర్ అరెస్టు విషయం తెలియడంతో 50 మందికి పైగా న్యాయవాదులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అన్వర్ అరెస్టుపై ఏసీపీ స్రవంతి రాయ్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఏసీపీ వారికి సరైన సమాధానం చెప్పకుండా ఫోన్ మాట్లాడుకోవాలి, అందరూ బయటకు వెళ్లండంటూ పంపించడంతో న్యాయవాదులు ఆగ్రహానికి గురయ్యారు. వారంతో స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో ఆ మార్గంలో వాహనాలు రాకపోలకు అంతరాయం ఏర్పడింది. ఏడీసీపీ రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, పలువురు సీఐలు అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పారు. న్యాయవాది అరెస్టుకు గల కారణాలను తెలిపి, 41ఏ నోటీసు ఇచ్చి పంపించారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల సంక్షేమానికి సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ కోరారు. కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నగర కళాకారుల ఆత్మీయ సమావేశం, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగాయి. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బి.వి.వీరభద్రరావు, ప్రిన్స్, డాక్టర్ వెన్నా వల్లభరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, అమ్ముల ప్రసాద్ పాల్గొన్నారు.

డంపర్ బిన్‌లను సరిచేయరూ..



నిరుపయోగంగా పడివున్న డంపర్ బిన్‌లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అంటూ ఒక పక్క అధికారులు ఆర్భాటం చేస్తున్నారు. మరో పక్క పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీ శ్మశానం సమీపంలో యూజీడీ మరమ్మతుల్లో భాగంగా రోడ్డును తవ్వారు. ఈ క్రమంలో ఇక్కడ ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లను పక్కన పడేశారు. వాటిని కనీసం మరో చోట ఏర్పాటు చేయటం లేదా అక్కడే వాటిని నిలబెట్టి చెత్తవేసేలా చర్యలు తీసుకోలేదు. ఇక్కడ డంపర్‌బిన్‌లు సక్రమంగా లేకపోవటంతో స్థానికులు చెత్తచెదారాన్ని పక్కనే ఉన్న ఏలూరు కాలువ, మురుగు కాలవల్లో పడేస్తున్నారు. అధికారులు స్పందించి డంపర్‌బిన్‌లను సరిచేయాలని కోరుతున్నారు.

ఒకేసారి పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

పటమట(విజయవాడతూర్పు): ఆస్తి, నీటి, డ్రైనేజీ, ఖాళీ స్థలాలకు సంబంధించి పేరుకుపోయిన పన్ను బకాయిలను ఈ నెల 31వ తేదీలోపు ఏక మొత్తంలో ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. దీన్ని పన్నుల చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రాయితీ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మొత్తం వడ్డీతో కట్టిన వారందరికీ కూడా వర్తిస్తుందని వివరించారు. రాయితీ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సర పన్నులకు జమ చేస్తామని తెలిపారు. పన్నుల చెల్లింపుదారుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల్లో ఉన్న 13 క్యాష్ కౌంటర్లు, మూడు జోనల్ కార్యాలయాల్లో ఉన్న ఆరు క్యాష్ కౌంటర్లు ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. మిగిలిన క్యాష్ కౌంటర్లు యథావిధిగా ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మంగళవారం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. 59వ డివిజన్ సింగ్‌నగర్‌కు చెందిన పాపయమ్మకు రూ.2.5 లక్షలు, పగడాల విశ్వనాథ్‌రెడ్డికి రూ.2.05 లక్షలు, రవీంద్ర ప్రసాద్‌కు రూ.50,524, నాగూర్ బీకి రూ.30,786, నజీమాకు రూ.10 వేలు, ముంతాజ్‌కు రూ.27,814 చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌కు మరమ్మతులు చేయండి

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక ప్రకాష్ నగర్‌లోని మోడరన్ చేపల మార్కెట్‌కు మరమ్మతులు చేపట్టాలని అధికారులను మునిసిపల్ కమిషనర్ హెచ్.ఎస్.ధ్యానచంద్ర ఆదేశించారు. మోడరన్ చేపల మార్కెట్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో కనీస సదుపాయాలు లేక రోడ్డుపై చేపల విక్రయాలు సాగించాల్సి వస్తోందని వ్యాపారులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చేపలను శుభ్రం చేసుకునేందుకు నీటి సదుపాయం లేదని, విద్యుత్ వసతి, టాయిలెట్లు లేవని వివరించారు. కమిషనర్ స్పందించి వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డు పైన చేపలు విక్రయించొద్దని వ్యాపారులకు సూచించారు. రోడ్డుపై వ్యాపారాల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. చేపల మార్కెట్‌కు రంగులు వేయించాలని, అవసరమైన ప్రాంతాల్లో ఫ్లోరింగ్ నిర్మించి శ్లాబు లీకులవుతుంటే మరమ్మతులు చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.శ్రీనివాసరెడ్డి, సీఎంహెచ్‌ఓ సురేష్‌బాబు, జోన్ కమిషనర్ ప్రభుదాస్, ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌బాబు, డీఈ లక్ష్మీసింధూర, ఏఈ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



చేపల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

ఆలపాటి సత్యనారాయణ మూర్తికి నివాళులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గోల్డ్ స్పాట్ సత్యనారాయణమూర్తిగా ప్రసిద్ధి చెందిన ఆలపాటి సత్యనారాయణ మూర్తి (80) హృదయ సంబంధిత వ్యాధితో కొంతకాలంగా హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని విజయవాడ సూర్యారావుపేట నరసింహారావు నాయుడు వీధిలోని స్వగృహానికి మంగళవారం తీసుకొచ్చారు. నగరంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సత్యనారాయణమూర్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ది విజయవాడ బాట్లింగ్ కంపెనీని విజయవాడలో ప్రారంభించి గోల్డ్‌స్పాట్, లిమ్కా తదితర శీతల పానీయాలు, బిస్లరీ సోడాలను కృష్ణాజిల్లా వ్యాప్తంగా పంపిణీచేసేవారు. సిద్ధార్థ అకాడమీ పాలకవర్గ సభ్యుడిగా, విజయవాడ క్లబ్, విజయవాడ వాకర్స్ అసోసియేషన్‌లో జీవితకాల సభ్యుడిగా సత్యనారాయణమూర్తి సేవలు అందించారు. పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సాయం చేయడంలోనూ ఆయన ముందుండేవారు. మంగళవారం మధ్యాహ్నం సత్యనారాయణమూర్తి అంతిమ యాత్ర, కృష్ణలంకలోని స్వర్గపురిలో అంత్యక్రియలు జరిగాయి.



సత్యనారాయణ మూర్తి (ఫైల్)

రంజాన్ మాసంలో పేద ముస్లింలను ఆదుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): రంజాన్ మాసంలో పేద ముస్లింలను ఆదుకోవాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా సూచించారు. న్యూ రాజరాజేశ్వరిపేటలోని మక్కా మసీదులో షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి నాగుల్‌మీరా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ప్రతి ఒక్క ముస్లిం, పెద్దలు పేద ముస్లింలకు సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలన్నారు. దీక్షలో ఉన్న వారికి ఖర్జూరం, లస్సీ, మంచి నీరు ఇస్తే ఉపవాసం ఉన్నంత పుణ్యం వస్తుందన్నారు. అనంతరం నాగుల్‌మీరాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ సికిందర్, నగర అధ్యక్షుడు సిలార్‌బేగ్, నగర కార్యదర్శి కబీర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడు షేక్ మీరావలి, ఎండీ నజీరుద్దీన్, పటా నజీర్ ఖాన్, మసీద్ ఇమామ్‌మౌలానా అట్లాస్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులో ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా

రామప్రసాద్‌కు సేవాస్వర్ణ నంది జాతీయ పురస్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదుర్గా భవానీ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా సనాతన ధర్మం వ్యాప్తికి చేస్తున్న కృషికి నగరానికి చెందిన దారపు వెంకట రామప్రసాద్‌ను సర్వేజనాః సుఖినోభవంతు సేవాసంస్థ ఆధ్వర్యాన సేవాస్వర్ణ నంది జాతీయ పురస్కారంతో సత్కరించారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సేవా స్వర్ణ నంది, విశ్వావసు ఉగాది జాతీయ స్థాయి పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య చేతులమీదుగా రామప్రసాద్‌కు ఈ పురస్కారం అందజేశారు. రామప్రసాద్‌కు పురస్కారంతో పాటు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. రామప్రసాద్‌ను నగరానికి చెందిన పలువురు మంగళవారం అభినందించారు.



రామప్రసాద్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

నగరానికి సమీపంలో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నగరానికి దగ్గరలో పేదలకు రెండు సెంట్లు భూమి, ఇళ్ల నిర్మించుకోవటానికి రూ.5 లక్షలు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.శ్రీదేవి డిమాండ్ చేశారు. 61 డివిజన్ వాటర్ ట్యాంక్ ఏరియాలో మంగళవారం ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై గ్రూప్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ సమీపంలో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లు ఖాళీగా ఉన్నాయన్నారు. 57 ఎకరాల డీప్నీ ల్యాండ్ స్థలాన్ని ఇళ్లులేని పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇవ్వాలని, ఖాళీగా ఉన్న అపార్ట్‌మెంట్‌లను నిరుపేదలకు కేటాయించాలని కోరారు. ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజల దగ్గర నుంచి కరెంటు చార్జీలు వసూలు చేయడం అన్యాయమని శ్రీదేవి అన్నారు.

కల్యాణం.. కమనీయం



లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం పద్మావతి, శ్రీనివాసుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకను శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 50 రకాల పుష్పాలు, తులసి మాలలతో స్వామిని అర్చించారు. ఈ వేడుకను భక్తులు కనులారా తిలకించి పులకించారు. - విజయవాడ కల్చరల్

